సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం ၊ 28 ၊ మే ၊ 2024



జూకు కొత్త హంగులు

విశాఖ: ఇందిరా గాంధీ జూ పార్కును రూ.కోట్లతో అభివృద్ధి చేయడంతో కొత్తదనం సంతరించుకుంది.



ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.



నేడు అష్టదళ పద్మారాధన

విశాఖ: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

గోమంగి మహిళా పోలీసు మృతి

- ప్రసవ సమయంలో విషమించిన ఆరోగ్యం
- మెరుగైన వైద్యం అందించినా దక్కని ఫలితం



గంపరాయి రమ్య (ఫైల్)

సాక్షి,పాడేరు: పెదబయలు మండలం గోమంగి గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న గంపరాయి రమ్య(32) సోమవారం మృతి చెందారు. గర్భిణి కావడంతో సెలవుపై హుకుంపేట మండలం అడ్డుమండలో ఉంటున్నారు. సోమవారం ఉదయం ఆమెకు పురిటినొప్పులు రావడంతో పాడేరు జిల్లా ఆస్పత్రిలోని తల్లీపిల్లల వైద్యవిభాగానికి తరలించారు. కొద్దిసేపటి తరువాత ఆమె మృత శిశువును ప్రసవించింది. అధిక రక్తపోటు కారణంగా ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది. మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. ఆమె మృతితో అరడకోట,అడ్డుమండ గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రమ్యసోదరుడు వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆమె మృతి పట్ల అరకు ఎంపీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజరాణి, అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సంతాపం తెలిపారు.

అడవిదున్న మాంసానికి పంచనామా



అడవిదున్న మాంసాన్ని పంచనామా అనంతరం దహనం చేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: వేటగాళ్లు ఒడిశాకు తరలిస్తుండగా పట్టుబడిన అడవిదున్న మాంసానికి పంచనామా నిర్వహించి దహనం చేశామని చింతపల్లి డీఎఫ్‌వో సీహెచ్ సూర్యనారాయణ పడాల్ తెలిపారు. పట్టుబడిన అడవిదున్న మాంసానికి సోమవారం మండల కేంద్రంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో పంచానామా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ఒడిశాకు చెందిన 13 మంది గిరిజనులు జీకేవీధి,కొయ్యూరు సరిహద్దు ప్రాంతాల్లో వేటాడిన అడవిదున్న మాంసాన్ని తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. వారినుంచి స్వాధీనం చేసుకున్న మాంసానికి నిర్వహించిన పరీక్షల్లో అడవిదున్నకు చెందినదిగా నిర్ధారణ అయిందన్నారు. పంచనామా కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, తహసీల్దార్ రత్నకుమార్, జీకేవీధి అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి,సర్పంచ్ సుభద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం తథ్యం



కర్నికలంకలో మాట్లాడుతున్న పార్వతమ్మ

జి.మాడుగుల: పాడేరు, అరకు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం ఖాయమని ఆ పార్టీ నాయకురాలు కురుసా పార్వతమ్మ, జిల్లా ఎగ్జిక్యుటివ్ మెంబర్ పాంగి రామకృష్ణ తెలిపారు. సోమవారం వారు గూడెం కొత్తవీధి, చింతపల్లి, జి.మాడుగుల మండలాల్లో పలు గ్రామాల్లో పార్టీ నేతలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించినట్టు వారు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు నిర్మించారని, రాష్ట్రంలో పారదర్శక పాలన అందించారన్నారు. ఇవన్నీ అభ్యర్థుల విజయానికి ఎంతగానో దోహదం చేయనున్నాయని వారు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పాడేరు, అరకు అసెంబ్లీ అభ్యర్థులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణిలు భారీ మెజారిటీతో విజయం తథ్యమన్నారు. ఎంపీటీసీలు విజయలక్ష్మి, చిట్టిబాబు, బూత్ కమిటీ అధ్యక్షుడు మేడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు సుదర్శన్, చిన్నబాబు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

● కాఫీకి పునరుజ్జీవం

రూ.5 కోట్లు.. కోటి మొక్కలు

కాఫీ తోటలను అభివృద్ధి చేసి గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర కాఫీ బోర్డు, పాడేరు ఐటీడీఏలో సంకల్పించాయి. ఇప్పటివరకు ఉన్న తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో కోటి మొక్కల పెంపకం చేపట్టాయి . ఇందుకు గాను రూ.5కోట్లు వెచ్చిస్తున్నాయి. జూలై రెండో వారం నుంచి గిరి రైతులకు మొక్కల పంపిణీకి కార్యాచరణ రూపొందించాయి.

- తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్‌కు జూలై నుంచి పంపిణీ
- ఆగస్టు నుంచి మొక్కలు నాటే పనులు
- గిరి రైతుల ఆదాయం పెంచేలా కార్యాచరణ
- ఏర్పాట్లు చేస్తున్న కేంద్ర కాఫీ బోర్డు, పాడేరు ఐటీడీఏ



రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాటుచేసిన కాఫీ నర్సరీలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులకు సిరులు కురిపిస్తున్న కాఫీ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తున్నాయి. ఆర్థికంగా అన్ని విధాలుగా ఆదుకుంటున్న కాఫీతోటలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర కాఫీబోర్డు, పాడేరు ఐటీడీఏలు ప్రత్యేక దృష్టి సారించాయి. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు ఏటా ఫలసాయం ఇస్తున్నాయి. అయితే వీటిలో చాలాచోట్ల చీడపీడలు కారణంగా దిగుబడి తగ్గగా కొన్నిచోట్ల ఎండిపోయాయి. అలాంటి వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితోపాటు గత ఐదేళ్ల నుంచి కొత్తగా నాటిన కాఫీ తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ పేరిట కొత్తగా మొక్కలు నాటే కార్యక్రమానికి కాఫీ బోర్డు, పాడేరు ఐటీడీఏలు శ్రీకారం చుట్టాయి. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 42వేల ఎకరాల కాఫీతోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ చేసేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగానే సుమారు పది వేల ఎకరాల పాత కాఫీతోటల్లో కొత్తగా మొక్కల పునరుద్ధరణ, గత ఐదేళ్లలో వేసిన 32 వేల ఎకరాల కాఫీ తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి పాడేరు ఐటీడీఏ పరిధిలోని పలు చోట్ల 25 నర్సరీలను ఏర్పాటుచేశాయి. వీటిలో కోటి కాఫీ మొక్కల పెంపకం చేపట్టారు. ఒకొక్క మొక్క ఉత్పత్తి, రైతులకు చేరవేసేందుకు సుమారు రూ.5 ఖర్చు కాగా కోటి మొక్కలకుగాను రూ.5కోట్లు వెచ్చిస్తున్నాయి. ఈ నిధులను కాఫీ బోర్డు, పాడేరు ఐటీడీఏ భరిస్తాయి. ఎకరాకు 225 మొక్కలు పంపిణీ చేస్తామని కాఫీ ప్రాజెక్ట్ అధికారులు చెబుతున్నారు. జూలై రెండో వారం నుంచి మొక్కల పంపిణీ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి మొక్కలు నాటే పనులు ప్రారంభమవుతాయి.



కాఫీ మొక్కల నర్సరీని పరిశీలిస్తున్న కాఫీ బోర్డు, ఐటీడీఏ అధికారులు

రైతులకు సాంకేతిక సహకారం



కాఫీ రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తాం. ప్లాంటేషన్ పనులు ఆగస్టు నుంచి మొదలవుతాయి. మొక్కలు నాటుకునే విధానంపై గిరి రైతులకు అవసరమైన మెళకువలు తెలియజేస్తారు. సస్యరక్షణ, సమగ్ర యాజమాన్యం చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారు.

– అశోక్, కాఫీ ఏడీ, పాడేరు ఐటీడీఏ

ముగ్గురు అటవీ అధికారుల సస్పెన్షన్

- కొయ్యూరు సెక్షన్ అధికారి, ఇద్దరు బీట్ అధికారులపై చర్యలు
- ఉత్తర్వులు జారీ చేసిన సీసీఎఫ్
- పెదవలస రేంజర్ జగదీష్‌కు మెమో

సాక్షి ఎఫెక్ట్..

కొయ్యూరు: స్మగ్లర్లతో చేతులు కలిపి అటవీసంపదకు నష్టం కలిగించిన ముగ్గురు అటవీ అధికారులపై ఆశాఖ ముఖ్య సంరక్షణ అధికారి(సీసీఎఫ్) కొరఢా ఝుళిపించారు. కొయ్యూరు సెక్షన్ పరిధి సోలాబు టేకు ప్లాంటేషన్‌లో 21 చెట్లు నరికి స్మగ్లర్లు పట్టుకుపోయారు. బూదరాళ్ల పంచాయతీ కొత్తపల్లి ప్రాంతంలోని అటవీ ప్లాంటేషన్‌లో మారుజాతి కలపకు చెందిన సుమారు 110 చెట్లు తరలిపోయాయి. గొల్లువలస ప్రాంతంలో పోడు వ్యవసాయం పేరిట సుమారు విలువైన వంద చెట్లు నరికివేతకు గురయ్యాయి. దీనిపై కొద్దిరోజుల క్రితం కంచె చేను మేస్తే అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ స్పందించారు. క్షేత్రస్థాయిలో ఆయా ప్రాంతాలను పరిశీలించి అటవీసంపదకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదించారు. దీనిపై విశాఖ సర్కిల్ సీసీఎఫ్ చర్యలు తీసుకున్నారు. ఇందుకు బాధ్యులైన కొయ్యూరు సెక్షన్ అధికారి సింహాద్రి, కాకరపాడు బీట్ అధికారి రాజ్‌కుమార్, మంప బీట్ అధికారి రాకేష్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు డీఎఫ్‌వో తెలిపారు. అంతేకాకుండా పెదవలస రేంజర్ జగదీష్‌కు మెమోను జారీ చేసినట్టు తెలిపారు. దీనిపై విచారణ కొనసాగుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో మరింత నిఘా

- జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత
- కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల పరిశీలన
- అధికారులతో సమీక్ష



కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ విజయ సునీత



సీసీ కెమెరాల వ్యవస్థను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

సాక్షి, పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అరకు, పాడేరు అసెంబ్లీ ఈవీఎల స్ట్రాంగ్ రూమ్‌ల ఆవరణ,డిగ్రీ కళాశాల రోడ్డులో సీసీ కెమెరాల నిఘాను మరింత పెంచాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు.సోమవారం రాత్రి ఆమె స్ట్రాంగ్ రూమ్‌ల ఆవరణ,కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ప్రధాన రహదారికి ఇరువైపులా కవర్ అయ్యేలా సీసీ కెమెరాల నిఘా ఉండాలని సూచించారు. పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటుచేయడమే కాకుండా కౌంటింగ్ కేంద్రాలలో అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది,ఏజెంట్లకు వేర్వేరుగా ప్రవేశ మార్గాలు ఉండాలని, పూర్తిస్థాయిలో తనిఖీలు తరువాతే ప్రవేశం కల్పించాలన్నారు. అలాగే భద్రతా చర్యలలో భాగంగా డిగ్రీ కళాశాల రోడ్డులో భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వవద్దని ఆమె ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో బి.పద్మావతి, ఎస్‌డీసీ అంబేద్కర్,ఏఆర్‌వో కళ్యాణచక్రవర్తి, గిరిజన సంక్షేమశాఖ డీఈఈ అనుదీప్ పాల్గొన్నారు.

మావోయిస్టుల కదలికలపై అప్రమత్తం

భారీ డంప్ స్వాధీనంతో కూంబింగ్ ముమ్మరం



గాలింపులో నిమగ్నమైన పోలీసు బలగాలు

సాక్షి,పాడేరు: ఏవోబీలో మావోయిస్టుల కదలికలపై పోలీసుశాఖ అప్రమత్తమైంది. మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల పోలీసు బలగాలు కూంబింగ్ ముమ్మరం చేశాయి. అణువణువు గాలింపు చర్యలు చేపట్టాయి. దీనిలో భాగంగానే గూడెం కొత్తవీధి మండలంలో మావోయిస్టు ప్రభావిత గాలికొండ పంచాయతీలోని పనసలబంద అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ డంప్‌ను పోలీసులు గుర్తించడం తెలిసిందే. దీనిని చాకచక్యంగా నిర్వీర్యం చేసి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుపార్టీలను హతమార్చే లక్ష్యంగా మావోయిస్టులు ఈ డంప్‌ను ఏర్పాటుచేశారని ఇప్పటికే ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రకటించారు. మావోయిస్టులకు పేలుడు పదార్థాలు లభించడంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మందుపాతరలు, పేలుడు సామగ్రిని గుర్తించేందుకు కూంబింగ్ పార్టీలు, బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు నిమగ్నమయ్యాయి. మరోవైపు మావోయిస్టు పార్టీ నేతలు, సభ్యులు, మిలీషియా సభ్యులు జనజీవన స్రవంతిలోకి చేరి స్వేచ్ఛగా జీవించాలని పోలీసుశాఖ పిలుపునకు మంచి స్పందన లభిస్తోంది. మావోయిస్టు పార్టీ పెదబయలు దళానికి చెందిన 13 మంది కీలక మిలీషియా సభ్యులు తాజాగా ఎస్పీ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. వీరిలో 2014 నుంచి మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నవారున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ గిరిజనులంతా అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. ప్రశాంత మన్యం లక్ష్యంగా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మావోయిస్టు పార్టీ కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

విద్యాసంస్థల్లో పారదర్శకంగా ప్రవేశాలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



అధికారులతో సమీక్షిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని విద్యాసంస్థల్లో ఐదు నుంచి ఇంటర్ వరకు దరఖాస్తు చేసుకున్న వారికి పారదర్శకంగా ప్రవేశాలు కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఆశాఖ అసిస్టెంట్ అధికారులు, గురుకుల కళాశాలల కన్వీనర్లు, ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లు, గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి ఇంటర్ వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి అర్హతను బట్టి సీట్లు కేటాయించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి తక్షణం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యార్థులను సమీప ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్ కల్పించాలని సూచించారు. గతేడాది ఏడో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు, ఆంగ్ల మాధ్యమ స్కూళ్ల వివరాలను ఆయన తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. అబ్బలోం, గురుకుల కళాశాలల కన్వీనర్ జి.ప్రసూన, ఈఆర్ఎంఎస్ కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ప్రసాద్, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ ఆస్పత్రికి ఎండోస్కోపీ ఉపకరణాలు



పరికరాలను స్వీకరిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి ముక్కు గొంతు(ఈఎన్‌టీ) ఆస్పత్రికి రెండు ఎండోస్కోపీ పరికరాలను మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ అందించారు. కేజీహెచ్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ ఆస్పత్రిలో రోగులను పరీక్షించడానికి ఉపకరించే రూ.1.50 లక్షల విలువైన ఈ పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ స్వీకరించారు. వీటి సహాయంతో ఓపీలో నేరుగా రోగులను పరీక్షించడం సాధ్యపడుతుందని సూపరింటెండెంట్ తెలిపారు.

అడవిలో అర్ధరాత్రి బిక్కుబిక్కుమని..

చింతూరు అటవీ ప్రాంతంలో రోడ్డుకడ్డంగా ట్రాలర్ నిలిచిపోవడంతో ప్రయాణికులు నరకం చూశారు. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో వెనక్కి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో బిక్కుబిక్కుమంటూ రాత్రంతా అటవీప్రాంతంలో గడపాల్సి వచ్చింది.

- ఘాట్‌లో రోడ్డుకు అడ్డంగా ట్రాలర్ తిరగడంతో ప్రయాణికుల అవస్థలు
- ఇరువైపులా భారీగా నిలిచిపోయిన వాహనాలు
- తెల్లవార్లు అటవీప్రాంతంలో జాగారం
- తిండి దొరక్క ఆకలితో అవస్థలు
- పండ్లు, నీళ్ల బాటిళ్లు అందించిన స్థానికులు



ఘాట్‌రోడ్‌లో రహదారికి అడ్డంగా నిలిచిపోయిన భారీ వాహనం



ఘాట్‌రోడ్డులో తులసిపాక వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

చింతూరు: మారేడుమిల్లి, చింతూరు ఘాట్‌రోడ్డులో ఆదివారం రాత్రి భారీ వాహనం ఇరుక్కుపోవడంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు నరకం చూశారు. ఓఎన్జీసీ మెషినరీతో జగ్దల్‌పూర్ నుంచి రాజమండ్రి వెళ్తున్న ట్రాలర్ లక్కవరం అటవీ సెక్షన్ పరిధి తులసిపాక సమీపంలోని ఘాట్‌రోడ్‌లో మలుపువద్ద రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. కేవలం ద్విచక్ర వాహనాలు వెళ్లే మార్గం తప్ప ఇతర వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆదివారం రాత్రి ఏడు గంటల నుంచి ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

అటవీ ప్రాంతంలో భయంభయంగా..: బస్సుల్లోని ప్రయాణికులతో పాటు ఇతర వాహనాలకు చెందిన వారు రాత్రంతా ఆహారం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజోలు, గోకవరం, కాకినాడ డిపోలకు చెందిన బస్సులు నిలిచిపోవడంతో వాటిలోని ప్రయాణికులు అటవీప్రాంతంలో చీకట్లో బిక్కుబిక్కుమంటూ జాగారం చేశారు.. కొంతమంది ప్రయాణికులు సాహసించి కాలినడకన సమీపంలోని తులసిపాక చేరుకుని అక్కడ రహదారి పక్కన పడుకున్నారు. సోమవారం ఉదయం ఇతర వాహనాల ద్వారా వారి గమ్యస్థానాలకు బయలుదేరారు. ప్రయాణికుల ఇబ్బందులు గమనించిన చింతూరుకు చెందిన కొంతమంది ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం ప్రయాణికులకు పండ్లు, నీళ్ల బాటిళ్లు అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు.

లారీల సాయంతో తొలగింపు

ట్రాఫిక్ నిలిచిపోవడంతో చింతూరు సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, గుర్తేడు ఎస్‌ఐ సాయికుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. తులసిపాక, మారేడుమిల్లిలో వాహనాలు నిలిపివేశారు. రహదారికి అడ్డంగా ఉన్న ట్రాలర్‌ను రెండు లారీల సాయంతో సాయంత్రం జరిపి వాహన రాకపోకలను కొనసాగించారు.



ఘాట్‌రోడ్డులో ప్రయాణికుల పడిగాపులు



కాలినడకన వెళ్తున్న ప్రయాణికులు

జలపాతంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



బయటకు తీసిన వేణుగోపాల్ మృతదేహం

పెదబయలు: మండలంలోని గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్ర జలపాతం వద్ద సెల్ఫీ తీసుకుంటూ జారి పడి గల్లంతైన యువకుడి సమరెడ్డి వేణుగోపాల్(24)మృతదేహం సోమవారం లభ్యమైంది. ఈ నెల 25తేదీన పిట్టలబొర్ర జలపాతం వద్ద అందాలు తిలకిస్తూ వేణుగోపాల్ సెల్ఫీ తీసుకుంటూ జలపాతంలో పడి గల్లంతవడం తెలిసిందే. అప్పటి నుంచి గాలింపు చేపట్టగా సోమవారం లభ్యమైందని తహసీల్దార్ రామ్మోహనరావు తెలిపారు. అతని ఆచూకీ కోసం స్థానిక గజ ఈతగాళ్లు సుమారు 36 గంటలపాటు శ్రమించారని ఆయన వివరించారు. జలపాతంలో 30 అడుగుల లోతులోంచి కర్రలు, తాళ్లసాయంతో బయటకు తీశారని ఆయన పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

వరదలను సమర్థంగా ఎదుర్కొందాం

- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య
- ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో వరదలు సంభవిస్తే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలని చింతూరు ఐటీడీఏ పీవో, ఆర్డీవో కావూరి చైతన్య సూచించారు. వరదల్లో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టార్పాలిన్లు, లైఫ్‌జాకెట్లు సిద్ధంగా ఉంచడంతో పాటు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు లాంచీలు, మరబోట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ముంపు ప్రాంతాల్లోని అన్ని పీహెచ్‌సీల్లో జనరేటర్లు ఉండేలా చూడాలని, హైరిస్క్ గర్భిణులు, వృద్ధులను ముందుగానే సమీప ఆస్పత్రులకు తరలించాలని సూచించారు. పిల్లలు, గర్భిణులకు పాలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కావాల్సిన మందులు ముందుగానే సిద్ధం చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. వరదలు సంభవిస్తే ముందుగానే నిత్యావసరాలు, టార్పాలిన్లు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని, అంటువ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీల్లో పూడికతీత, బ్లీచింగ్ చల్లించాలని ఆయన ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, బాధితులను పునరావస కేంద్రాలకు తరలించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. వరదల సమయంలో నిత్యావసరాలు తరలించేందుకు మంజూరైన ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను పీవో ఆదేశించారు. వరదలు తగ్గుముఖం పట్టిన వెంటనే విద్యుత్‌లైన్ల పునరుద్ధరణకు మండలానికి నాలుగు చొప్పున నాటు పడవలు, పునరావాస కేంద్రాల వద్ద జనరేటర్ల ఏర్పాటుకు డీజిల్ అందుబాటులో ఉంచాలని పీవోను విద్యుత్ శాఖ అధికారులు కోరారు. ఈ సమావేశంలో చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా, డీఎఫ్‌వో బబిత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏపీవో సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాల పురస్కారాలకు దరఖాస్తులు



లవకుశ

పాడేరు రూరల్(హుకుంపేట): కేంద్ర, ప్రభుత్వ స్త్రీ శిశు సంక్షేమ శాఖ జాతీయ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ లవకుశ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పురస్కారాల కోసం జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన 5 నుంచి 18 సంవత్సరాలలోపు వయసుగల బాలలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సామజిక సేవ, సాంకేతిక జ్ఞానం, విద్య, వైద్యం, సాహసాలు, పర్యావరణం, నృత్యం, సంగీతం, పెయింటింగ్, కళలు, సాహిత్యం, క్రీడలు, నూతన అవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలున్న వాటిలో రాష్ట్ర జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో కనపరిచిన ఆసక్తి కలిగిన బాలలు జూలై 31వ తేదిలోగా http://awadr.gov.in ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. కేంద్ర కమిటీ పరిశీలన అనంతరం ఎంపికైన బాలలను ఢిల్లిలో 2025 జనవరిలో రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేయనన్నట్టు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయం

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద అదే ప్రాంతానికి చెందిన జ్యోతికిరణ్ గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడ్డాడు. కాలికి తీవ్ర గాయమయింది. స్థానికుల సహాయంతో హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు.

కలలు కన్నారు.. కొలువు సాధించారు



పాలిటెక్నిక్ విద్యార్థికి నియామకపత్రాన్ని అందజేస్తున్న కమిషనర్ నాగరాణి

- ఉద్యోగాలు సాధించిన 298 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు
- వేడుకగా జాబ్ అచీవర్స్ డే
- కుటుంబాలకు అండగా నిలవండి
- విద్యార్థులకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సూచన

మురళీనగర్(విశాఖ): పాలిటెక్నిక్ విద్యనభ్యసించిన అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు.. మీ తల్లిదండ్రులు, కుటుంబానికి అండగా నిలవాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి పిలుపునిచ్చారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన సోమవారం జాబ్ అచీవర్స్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించడం ఒక ఎత్తు అయితే.. దానిని నిలబెట్టుకోవడం మరొక ఎత్తు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఒక విద్యా సంవత్సరంలో 298 మందికి ఉద్యోగాలు రావడం ఒక రికార్డుగా ఆమె పేర్కొన్నారు. ఎంతో మంది సమన్వయంగా పని చేస్తే గానీ ఇంతటి మంచి ఫలితాలు రావడం కష్టమన్నారు. ఇప్పుడు ఉద్యోగాలు పొందిన విద్యార్థులందరూ మరొక ఆలోచన లేకుండా వెంటనే విధుల్లో చేరాలని సూచించారు. రెండేళ్ల సర్వీసు చేసిన తర్వాత ఉన్నత చదువులు చదువుకోవడానికి కంపెనీలు అవకాశం ఇస్తున్నాయని చెప్పారు. 18 ఏళ్లకే అత్యధిక ప్యాకేజీలతో మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు రావడం అదృష్టంగా భావించాలన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు అద్భుతమైన ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించడానికి సాంకతిక విద్యా శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్ డిమాండ్‌లను తీర్చేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని కమిషనర్ వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హరిబాబు, ఇతర శాఖల హెడ్‌లను అభినందించారు. అనంతరం విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డీడీ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, స్టేట్ కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ కె.జానకీరామ్ ప్రసంగించారు. స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ జి.వి.ఎస్ ప్రసాద్, ఒడిస్ కంట్రోల్ ఎండీ ఎస్.నందగోపాల్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి, టీపీవో హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆమె వివిధ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు.



కమిషనర్ నాగరాణితో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

298 మందికి ఉద్యోగాలు

పాలిటెక్నిక్ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికీ ఉద్యోగం కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో తమ కాలేజీలో చదివిన 298 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, థాట్‌వర్క్స్, మేఘా ఇంజినీరింగ్, జీఈ ఏరోస్పేస్, మోస్ చిప్, సుజ్లాన్, అమర్‌రాజా, ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా, ఎఫ్‌ట్రానిక్స్, మేధా సర్వో, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, షాపూర్జీ పల్లంజీ, అల్స్టాజ్ లఫలస్కీ, ట్రావల్‌కి, ట్రావల్ ప్రాజెక్ట్, రాయల్ ఎన్‌ఫీల్డ్, వీల్స్ ఇండియా, స్మార్ట్‌డీవీ టెక్నాలజీస్, నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్, హెచ్‌ఎల్ మాండో ఆనంద్ ఇండియా వంటి ప్రధాన సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు.

కమిషనర్‌కు కృతజ్ఞతలు



మాకు మంచి ఉద్యోగాలు రావడానికి కృషి చేసిన కమిషనర్‌కి మా కాలేజీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఒకే సంవత్సరంలో 298 మందికి ఉద్యోగాలు రావడం చాలా గొప్ప విషయం. నాకు చెన్నైలోని టెక్నిక్ ఎనర్జీస్‌లో రూ.4 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. పాస్‌అవుట్ అయ్యే నాటికి ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. నాన్న ఎంజీ నాయుడు ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ నన్ను చదివిస్తున్నారు.

– ఎ.దేవహర్షిణి, మెకానికల్ డిప్లమో, సాగర్‌నగర్

మేము చాలా లక్కీ



డిప్లమో విద్యార్థిగా బీటెక్ స్థాయిలో వార్షిక ప్యాకేజీ సాధించడం చాలా లక్కీ. టెక్నిక్ ఎనర్జీలో రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యాను. నాన్న శ్రీను కూలి పనులు చేస్తూ మా కుంటుంబాన్ని పోషిస్తున్నారు. ఉద్యోగంలో చేరి నాన్నకు అండగా ఉంటాను.

– ఎల్.శృతి, మెకానికల్ డిప్లమో, కైలాసపురం

ఈ కాలేజీలో చదవడం నా అదృష్టం



కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో చదవడం నా అదృష్టం. నా సీనియర్లు కూడా మంచి ఉద్యోగాలు పొందారు. నేను శ్రీకాకుళం నుంచి ఇక్కడికి వచ్చి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాను. హైదరాబాద్ షాపూర్‌జీ పల్లంజీలో ఉద్యోగం వచ్చింది. వెంటనే విధుల్లో చేరడానికి సిద్ధమవుతున్నాను.

–జి.తేజస్విని, సివిల్ ఇంజినీరింగ్

రూ.5లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



నాకు ముంబయిలోని ఆల్సా లావెల్‌లో రూ.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. మల్టీనేషనల్ కంపెనీలో మంచి ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది. మా ప్రిన్సిపాల్, టీపీవో, డిపార్టుమెంట్ హెడ్‌లు, అధ్యాపకుల సహకారంతో ఈ ఘనత సాధించాను. మాది చాలా పేద కుటుంబం. ఈ ఉద్యోగం రావడంతో మా అమ్మానాన్న ఎంతో సంతోషిస్తున్నారు.

– అఖిల్ కుమార్ నాయక్, మెకానికల్ ఇంజినీరింగ్, అగనంపూడి

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

రాంబిల్లి: మండల కేంద్రం రాంబిల్లిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు. పెదకలవలాపల్లికి చెందిన మడగల భూదేవి(59)ని మండల పరిషత్ కార్యాలయం ఎదుట అచ్యుతాపురం నుంచి రాంబిల్లి వైపు వస్తున్న క్రేన్ ఢీకొట్టింది. ప్రమాదంలో భూదేవి శరీరం నుజ్జునుజ్జయింది. ఈమె అవివాహిత. మేనల్లుడి వద్ద ఉంటోంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మణరావు తెలిపారు.

పోర్టును సందర్శించిన తూర్పు కోస్తా రైల్వే జీఎం



పోర్టును సందర్శించిన తూర్పు కోస్తా రైల్వే జీఎం ఎం.కె.బెహ్రో

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ, విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిధిలో జరుగుతున్న వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించేందుకు వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్‌తో కలిసి ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్(ఇన్‌చార్జి) ఎం.కె.బెహ్రో సోమవారం విశాఖ పోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టు పరిధిలో జరుగుతున్న రైల్వే సంబంధిత అంశాలను పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే వారికి వివరించారు. సరుకు రవాణాను మరింత పెంపొందించేందుకు రేక్‌లను కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోర్టు పరిధిలో జరుగుతున్న రైల్వే విద్యుదీకరణ అంశాలను సైతం విశదీకరించారు. దీనిపై ఈస్ట్ కోస్ట్ జీఎం ఎం.కె.బెహ్రో మాట్లాడుతూ రైల్వే సంబంధిత అభివృద్ధి పనులకు తమ పూర్తి సహకారం అందిస్తాని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పోర్టు ఉన్నతాధికారులతో పాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

వ్యాగన్ వర్క్‌షాప్ సందర్శన..

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ఎం.కె.బెహరా సోమవారం వాల్తేర్ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, పనితీరును పరిశీలించారు. వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్‌ను సందర్శించి, అక్కడి సదుపాయాలు, నిర్వహణ కార్యకలాపాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో డివిజనల్ ఉన్నతాధికారులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు. ఈ పర్యటనలో జీఎంతో పాటు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌కే సేనాపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎన్‌బీఏ గుర్తింపు సాధనలో మనమే నంబర్ 1

- తర్వాత స్థానాల్లో మహారాష్ట్ర, తెలంగాణ
- రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నాగరాణి

మురళీనగర్(విశాఖ): నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) సాధించడం అందని ద్రాక్షలాంటిదని భావించే వారికి ఆంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతి ఆదర్శంగా నిలుస్తుంది. పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహించే కోర్సులన్నింటికీ ఎన్‌బీఏ సాధించడం ఒక వరంలా భావిస్తారు. ఇప్పటి వరకు అదొక బ్రహ్మ పదార్థంగా భావించిన వారికి మన పాలిటెక్నిక్‌లు ఎన్‌బీఏ గుర్తింపు సాధించి దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం చారిత్రాత్మకంగా నిలుస్తుంది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా సి.నాగరాణి బాధ్యతలు చేపట్టిన తర్వాత సాంకేతిక విద్యా వ్యవస్థలో ప్రక్షాళనలు జరిగి అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. జాబ్ అచీవ్‌మెంట్ డే కార్యక్రమంలో పాల్గొని.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.

ప్రతిష్ఠాత్మకంగా ఎన్‌బీఏ గుర్తింపు

జాతీయస్థాయిలో మన రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలకు గుర్తింపు సాధించాలని ప్రథమ లక్ష్యంగా పెట్టుకున్నాం. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు రావడం మకుటాయమానంగా నిలుస్తుంది. దీని వల్ల మన విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విలువ పెరిగి అత్యుత్తమ ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. అందుకే ప్రభుత్వ కాలేజీలు ఎన్‌బీఏ గుర్తింపు కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేశాం. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన కల్పించి.. దీని వల్ల మన ప్రతిష్ట ఎలా పెరుగుతుందో వివరించాం. ఇందుకోసం ఎన్‌బీఏ కో–ఆర్డినేషన్ బృందాలను ఏర్పాటు చేశాం. నిరంతరం పర్యవేక్షిస్తూ ఇందుకు అవసరమైన వనరులను సమకూర్చాం. ఏడాది పాటు శ్రమించాం. ఎన్‌బీఏ అధికారుల బృందం అన్ని రకాల పారామీటర్స్ నిశితంగా పరిశీలించి సంతృప్తి చెందితేనే గుర్తింపునకు సిఫార్సు చేస్తుంది. కాలేజీల్లోని మౌలిక సదుపాయాలు, బోధనాభ్యసన విధానాల్లో సృజనాత్మకత, బోధనా ప్రమాణాలు, విద్యా ప్రమాణాలు, ఫలితాలు, ల్యాబ్, టెక్నాలజీ, లైబ్రరీ వినియోగం వంటి అంశాలను పరిశీలిస్తుంది. అందరి కృషి ఫలితంగా మన రాష్ట్రంలో 40 ప్రభుత్వ కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం. మహారాష్ట్రలో 30 కాలేజీలకు గుర్తింపు రావడంతో రెండవ స్థానంలో, తెలంగాణలో 26 కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపుతో మూడవ స్థానంలో ఉన్నాయి. మన రాష్ట్రంలో మిగతా కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు కోసం కృషి జరుగుతోంది. ఎన్‌బీఏ గుర్తింపు వల్ల కొత్త కోర్సులు ప్రారంభించడంతో పాటు విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఇక్కడి విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదుగుతారు.

ఉద్యోగాలిచ్చే వారికి రెడ్/గ్రీన్ కార్పెట్‌లు

మన విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వడానికి ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు రెడ్/గ్రీన్ కార్పెట్‌లతో ఆహ్వానిస్తున్నాం. పాలిటెక్నిక్ కళాశాలల టీపీవోలు ప్రత్యేక ఎంవోయూలు కుదుర్చుకుంటున్నారు. దీని వల్ల ప్రతి కాలేజీలోనూ కనీసం 70 శాతం మందికి ఉద్యోగాలు పొందుతున్నారు. మల్టీ నేషనల్ కంపెనీలు మన విద్యార్థులకు మంచి ఆఫర్‌లు ఇస్తున్నాయి. అత్యధికంగా రూ.8.25 లక్షల నుంచి రూ.5 లక్షలు, 4 లక్షలకు పైగా వార్షిక ప్యాకేజీలతో ఉద్యోగాలు వస్తున్నాయి. ఒక విద్యా సంవత్సరంలో కాలేజీ విద్యార్థుల సంఖ్యను బట్టి వంద నుంచి 300 మంది వరకు ఉద్యోగాలు సాధించడమంటే మాటలు కాదు. ఇది అందరి సమన్వయంతో కృషి చేయడం వలనే సాధ్యమైంది. ఈ పరంపర రానున్న కాలంలో కొనసాగించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం.

12,000 మందికి ఉద్యోగాలు

మన రాష్ట్రంలో ఈ ఏడాది (2023–24)లో 12,000 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. ప్రత్యేక డ్రైవ్‌ల నిర్వహణ ద్వారా ఇది సాధించాం. మునుపెన్నడూ లేని విధంగా క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం సెంట్రలైజ్డ్ పర్యవేక్షణ చేస్తూ అన్ని కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లు, టీపీవోలు, కంపెనీ ప్రతినిధులు ఒకే వేదికపై చర్చించి.. కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేయడానికి సూచనలిస్తున్నాం. రాష్ట్రస్థాయిలో ఇందుకోసం డిప్యూటీ డైరెక్టర్ స్థాయిలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ పనిచేస్తున్నారు. కనీసం వారానికోసారి దీనిపై సమీక్ష నిర్వహించడం వల్ల మంచి సత్ఫలితాలు వచ్చాయి. పాడేరు, చీపురుపల్లి, శ్రీశైలం, మడకశిర, ధర్మవరం, రాయచోటి వంటి మారుమూల ప్రాంతాల్లోని పాలిటెక్నిక్ విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించారు. సెంట్రల్, క్లస్టర్ డ్రైవ్‌లు, కాలేజీల వారీగా క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఇది మంచి ఫలితాలినిచ్చింది. మేనేజ్‌మెంట్‌తో సంబంధం లేకుండా ప్రైవేటు కాలేజీల్లో కూడా ప్లేస్‌మెంట్‌ల కోసం ప్రత్యేక క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణనిస్తున్నాం. సిలబస్‌లో మార్పులు తెచ్చాం. మన విద్యార్థులను టెక్నాలజీ 4.0 దిశగా తయారు చేస్తున్నాం.

రైల్లో ప్రయాణికుడి మృతి

పార్వతీపురం టౌన్: పుణ్య క్షేత్రాలను సందర్శించి తిరిగి ఇంటికి వస్తుండగా ఓ ప్రయాణికుడు రైల్లో గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా పెందుర్తిలోని నూకాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన కొందరు పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. వారిలో రాళ్లపల్లి సత్యనారాయణ (63), ఆయన భార్య మణి ఉన్నారు. వారంతా తిరుగు ప్రయాణంలో భాగంగా ఢిల్లీలో సమతా ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. టిట్లాఘడ్ వచ్చేసరికి సత్యనారాయణ అస్వస్థతకు గురికావడంతో అక్కడే దిగిపోయి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొంచెం నయం కావడంతో నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో మళ్లీ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో పార్వతీపురం సమీపానికి వచ్చేసరికి సత్యనారాయణ తీవ్ర అస్వస్థతకు గురై గుండె పోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది జీఆర్పీ సిబ్బందికి తెలియజేయగా వారు సత్యనారాయణ భార్య మణి నుంచి వివరాలు సేకరించి మృతదేహాన్ని అత్యవసర వాహనంలో పెందుర్తి తరలించారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు పెయిరింగ్ రైళ్ల ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లను రీషెడ్యూల్ చేసినట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్‌లో సోమవారం సాయంత్రం 4.35 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్–అగర్తల(07030) సమ్మర్ స్పెషల్ సుమారు 7 గంటలు ఆలస్యంగా రాత్రి 11.35 గంటలకు బయల్దేరింది.
- సంత్రగచ్చిలో సోమవారం సాయత్రం 6 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి – తాంబరం(22841) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 17 గంటలు ఆలస్యంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు బయల్దేరనుంది.
- హౌరాలో సోమవారం ఉదయం 10.50 గంటలకు బయల్దేరాల్సిన హౌరా–ఎస్ఎంవీ బెంగళూరు(22863) ఎక్స్‌ప్రెస్ 2 గంటల ఆలస్యంగా మధ్యాహ్నం 12.50 గంటలకు బయల్దేరింది.
- హౌరాలో సోమవారం సాయంత్రం 4.15 గంటలకు బయల్దేరాల్సిన హౌరా–కన్యకుమారి(12665) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటల ఆలస్యంగా రాత్రి 6.30 గంటలకు బయల్దేరింది.
- చెన్నై సెంట్రల్‌లో సోమవారం రాత్రి 7 గంటలకు బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హౌరా(12840) సూపర్‌ఫాస్ట్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయల్దేరింది.

ఒడిశా కార్మికుడి మృతి



హేమంత్ భుయ్ మృతదేహం

పద్మనాభం: మద్దిలోని ఇటుక బట్టీలో పని చేస్తున్న ఒడిశాకు చెందిన హేమంత్ భుయ్(27) అనే కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మద్దిలో పోక శ్రీనివాసరావు ఇటుక బట్టీలో కూలి పనిచేయడానికి ఒడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా బాబాలజురి సమీపంలోని బంద బుజూరికి చెందిన హేమంత్ భుయ్ తన భార్య రోజి బామ్‌తో కలసి ఈ ఏడాది జనవరిలో వచ్చాడు. సోమవారం బట్టీలో పనిచేస్తుండగా హేమంత్ భుయ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చే సరికి ఆయన మృతి చెందాడు. హేమంత్ గుండెపోటుతో మరణించినట్లు 108 సిబ్బంది నిర్ధారించారని పోలీసులు వెల్లడించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వృద్ధుడు అదృశ్యం



అదృశ్యమైన ధనరాజు

గంగవరం : గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో మొల్లేరు గ్రామంలో 61 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు అదృశ్యమైనట్టు స్థానిక పోలీసు స్టేషన్‌కి సోమవారం ఫిర్యాదు అందింది. దీనిపై గంగవరం ఎస్‌ఐ రామకృష్ణ మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఈ కేసు గురించి ఆయన వివరించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగవరం మండలం మొల్లేరు గ్రామానికి చెందిన పెనుమత్స ధనరాజు (61) వ్యక్తి కుటుంబంతో మొల్లేరు సమీపంలోని మామిడితోటలో నివాసముంటున్నాడు. రోజూ మామిడి తోటను సంరక్షిస్తూ ఉండే వ్యక్తి సోమవారం ఉదయం నుంచి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య నాగమణి భర్త ఆచూకీ కోసం ఎదురుచూసి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ధనరాజు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. మొల్లేరు సమీపంలో గల మామిడి తోటలో కూడా గాలించాలన్నారు. కేసు విచారణ చేస్తున్నామని , ధనరాజ ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు



ఫీడర్ అంబులెన్స్ సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

గూడెంకొత్తవీధి: ఆస్పత్రిలోని ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా అన్నారు. పెదవలస ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేయాలని ఆయన సూచించారు. ఆస్పత్రిలో కుక్క కాటు, పాము కాటు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఫీడర్ అంబులెన్స్ సేవలు కోసం అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

338 కిలోల గంజాయి స్వాధీనం



చింతపల్లిలో గంజాయి నిందితులతో అన్నవరం ఎస్‌ఐ రాజారావు



చీడిపాలెం జంక్షన్ వద్ద గంజాయితో పట్టుబడిన నిందితులు



డొంకరాయి చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసు అధికారులు

కొయ్యూరు/చింతపల్లిరూరల్: రెండు మండలాల్లో ఆటోల్లో తరలిస్తున్న 334 కిలోల గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకుని, తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. చింతపల్లి మండలం లోతుగెడ్డ వంతెన వద్ద తనిఖీలు చేస్తుండగా రెండు ఆటోల్లో ఒడిశా రాష్ట్రం నుంచి తరలిస్తున్న గంజాయి బయటపడినట్టు అన్నవరం ఎస్‌ఐ పి.రాజారావు తెలిపారు. చింతపల్లి మండలం రాళ్లగెడ్డకి చెందిన కిల్లో కేశవరావు, మేడూరుకి చెందిన సీందరి నాని,కప్పగొందికి చెందిన పాలికి కొండబాబులను అరెస్టు చేసి, వారి నుంచి 124 కిలోల గంజాయి, ఆటోలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

చీడిపాలెం జంక్షన్‌లో...

కొయ్యూరు మండలం చీడిపాలెం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా 210 కిలోల గంజాయి పట్టుబడినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. అందిన సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. దొడ్డవరం నుంచి వచ్చిన రెండు బైక్‌లను తనిఖీ చేస్తుండగా, వాటి వెనక వచ్చిన ఆటోలోని వారు పరారయ్యేందుకు ప్రయత్నించారని తెలిపారు. వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి, నిందితులను పట్టుకున్నామని చెప్పారు. ఒడిశాలో ముక్కలగూడకు చెందిన లైచన్ తంగుల్,బాసుదేవ్ తంగుల్,పెదబయలకు చెందిన బొండా ప్రభాకర్,జర్సింగ్ గంతన్న, గల్లెలి రామారావు, జర్సింగ్ సంతోష్‌లను అరెస్టు చేశామన్నారు. వీరు గంజాయిని చింతపల్లి ప్రాంతం నుంచి బూదరాళ్ల మీదుగా ఆటోలో తీసుకువస్తున్నారని చెప్పారు. గంజాయితో పాటు రెండు బైక్‌లు,ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

డొంకరాయి చెక్‌పోస్ట్ వద్ద..

మోతుగూడెం: డొంకరాయి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్ట్ వద్ద సోమవారం నాలుగు కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.కృష్ణా జిల్లా పెడనకు చెందిన కొండా రాకేష్(25), షేక్ బాజి(24) లు ఒడిశాలోని పశువులంక ప్రాంతంలో నాలుగు కిలోల గంజాయిని కొనుగోలు చేసి బైక్‌పై తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. నిందితులను అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఐసీఎంఏఐ విశాఖ చాప్టర్ కమిటీ ఎన్నిక

విశాఖ విద్య: ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) విశాఖపట్నం చాప్టర్‌కు నూతన కమిటీ ఏర్పాటైంది. అక్కయ్యపాలెంలోని సీఎంఏ భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో చాప్టర్ బాధ్యులు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చాప్టర్ నూతన కమిటీ చైర్మన్‌గా యు.లక్ష్మణరావు, వైస్ చైర్మన్‌గా జి. రామలింగారెడ్డి, కార్యదర్శిగా వి.శాంతి శిరీష , కోశాధికారిగా ఎం. హిమబిందు ఎన్నికయ్యారు. అదే విధంగా పీబీ కృష్ణమాచారి, బి.నరేంద్ర, ఎస్.వెంకటేష్, బి.సంపత్, ఎస్.రాజశేఖర్ కమిటీ సభ్యులుగా ఎంపియ్యారు. చాప్టర్ నూతన పాలక మండలి 2024–25 సంవత్సరానికి పనిచేస్తుందని చైర్మన్ లక్ష్మణరావు తెలిపారు. సీఎంఏ విద్యనభ్యసించే విద్యార్థులకు తోడ్పాటు అందించడంతో పాటు చాప్టర్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామన్నారు.